జాగ్రత్త

పాలడుగు వెంకటేశ్వరరావు



సుబ్బారావు బట్టలు వేసుకుని ట్రిమ్‌గా తయారయి ముందు వరండాలోకి వచ్చాడు, బెల్టు సర్దుకుంటూ. వరండాలో సోఫాలో కూర్చుని వున్న ముసలయ్యగారు కొడుకుని చూసి చిరునవ్వు నవ్వారు. ఆయన నవ్వులో వాత్సల్యం వుంది. ప్రేమ వుంది. ఆశీర్వచనం వుంది. ఆశ కూడా వుంది.

'నేను ఆఫీసుకి వెళ్లి వస్తాను, నాన్నా' అన్నాడు సుబ్బారావు తండ్రితో.

'అలాగే. జాగ్రత్తగా వెళ్లిరా నాన్నా' అన్నాడు ముసలాయన, వాత్సల్యం నిండిన స్వరంతో.

సైకిలు ఎక్కబోతూ, తలెత్తి బెడ్‌రూం కిటికీ వైపు చూసాడు సుబ్బారావు. కిటికీ దగ్గర నిలబడి దొంగ చూపులు చూస్తూ వున్న సుజాత అర్జంట్‌గా చూపులు ప్రక్కకు తిప్పుకుంది. సుజాత చంకలో బోసి నవ్వులు వలకబోస్తూ బాబు కేరింతలు కొడుతూ వున్నాడు. ప్రేమగా చెయ్యెత్తి టాటా చెప్పాడు సుబ్బారావు. అప్రయత్నంగానే చెయ్యి వూపిన సుజాత కన్నులలో అనురాగం, ఆప్యాయత ఆరాధన దాగలేక పోయాయి. సెలయేటి నీటిలాగ ముందుకి వురికాయి.

'దండాలండీ, అయ్యగారూ !'

వెనుదిరిగి చూసాడు సుబ్బారావు. వినయంగా రెండుచేతులూ కలిపి నమస్కారం చేస్తున్నాడు మునిరత్నం. మునిరత్నం పెళ్లాం, పిల్లలూ తాడూ బొంగరం లేనివాడు. ఆకలితో అల్లాడుతూ రోడ్ల వెంట తిరుగుతూ వున్న మునిరత్నానికి సుమారు ఏడాదిక్రితం ఆశ్రయం ఇచ్చాడు సుబ్బారావు. అప్పటినుంచీ ఆ ఇంటినే కనిపెట్టుకుని వుంటూ, ఆ పనీ ఈ పనీ చేస్తూ పడివుంటున్నాడు మునిరత్నం.

'ఆఫీసుకేనా అయ్యగారూ ! జాగ్రత్తగా వెళ్లిరండి' అన్నాడు మునిరత్నం అభిమానంగా.

'సరేలేవోయ్' విసుగ్గా అన్నాడు సుబ్బారావు.

జాగ్రత్త !

జాగ్రత్త !

తనకి అందరూ జాగర్తలు చెప్పేవాళ్లే ! తనేదో సముద్రం మీదకి సాహసయానానికీ, పర్వతాల పయికి ఎక్స్‌పెడిషన్‌కీ వెళ్తున్నాడన్నట్టూ, అతి భయంకర మయిన పరిస్థితుల్ని ఎదుర్కోబోతున్నట్టూ—ఇందాక, ఇంట్లో సుజాతా అంతే ! అందరిదీ ఒకటే పాట ! జాగ్రత్త ! జాగ్రత్త !

అతను బాత్‌రూం నుంచి బయటికి వచ్చాడు—ఇందాక. ఏదో పని చేస్తూ అక్కడ్నే తచ్చాడుతూ వుంది సుజాత. సుతారంగా ఆ వాలు జడని పట్టుకుని, తన వేపు త్రిప్పుకుని, కౌగిలిలో బంధించి, పెదాల మీద బలంగా ముద్ర వేశాడు సుబ్బారావు. తన్మయంతో కన్నులరమోడ్చి కొన్ని క్షణాలు అలాగే వుండిపోయింది తరుణి. ఆ వెంటనే ఏదో గుర్తు వచ్చినట్లుగా—

'ఆఫీసుకి టయిమవటంలేదూ ?' అంది నవ్వి ఆ నవ్వు మన మోహన కరమయి వట్టిది !

అవునన్నట్టు తల వూపాడు సుబ్బారావూ, నవ్వుతూ. అప్పుడే పదవుతూంది.

'మరి తొందరగా తయారవండీ.' అని ఆర్డరు వేసింది అతివ.

అలాగేనన్నట్టు కళ్లు ఆడించాడు సుబ్బారావు సుబ్బారావు గబగబా బట్టలు వేసుకుని బెడ్‌రూంలోంచి బయట పడుతూ వుండగా, కాఫీ గ్లాసు తెచ్చి అందించింది సుజాత. అది తాగి కాళీ గ్లాసు అందించుతూ—

'వెళ్తానూ !' అన్నాడు సుబ్బారావు, అయిష్టంగా.

'అలాగే. జాగర్తగా వెళ్లిరండీ' అంది సుజాత.

నవ్వుకున్నాడు సుబ్బారావు జాగ్రత్తట ?

సైకిలెక్కి వుషారుగా తొక్కాడు సుబ్బారావు. గబగబ వురికించాడు వాహనాన్ని.

రోడ్డు కురుక్షేత్ర రణరంగంలాగ వుంది. ఆర్టీసీబస్సులు, సిటీబస్సులు, రిక్షాలు, సైకిళ్లు, వాటిమీద క్రిక్కిరిసిన మనుషులు క్షురవాళ్లు, యువకులు, ముసలి వాళ్లు, ఆడా, మగా, పిల్లలూను. కాలినడకన కొంప మునిగిపోయేటట్టుగా హడావుడిగా సాగిపోయే

మనుషులు. నేల ఈనినట్టుగా రకరకాల వాహనాలు. ఏ వాహనమూలేని మరి ఎందరో మ నుష లు. అంతా హడావుడి. స్పీడు. ఉరుకులూ, పరుగులూ.

సైకిలు మీద బాణంలాగ దూసుకుని పోతూవున్న సుబ్బారావుని సెంటర్లో చప్పట్లుకొట్టి పిలిచాడు, చంద్రరావు. చంద్రరావుదీ సుబ్బారావు వూరే. అతనికి ఆ సెంటర్లోనే పెద్ద బట్టలషాపు వుంది. బాగా కలిగినవాడు. అతనికి సుబ్బారావంటే అభిమానం. ఆ అభిమానంతోనే అతను సుబ్బారావుని మంచికీ, చెడుకీ ఆదుకుంటాడు. మాట రూపేణా డబ్బు విషయికంగా, అప్పు గావల్సినప్పుడూ, చంద్రరావు సుబ్బారావుని గతంలో అనేకసార్లు ఆదుకున్నాడు. ఈ రోజుకి లెక్కలు చూస్తే సుబ్బారావు అతనికి సుమారు వెయ్యి రూపాయలు కాష్గా, దుకాణంలో తీసుకున్న బట్టలు తాలూకు అయిదు వందల రూపాయలు అరువూ ఇవ్వదేలతాడు.

రెండ్నిమిషాలు మంచీ చెడూ మాట్లాడాక 'ఏమిటయ్యా ఆ స్పీడూ?' అని అడిగాడు చంద్రరావు.

సుబ్బారావు నవ్వి, 'ఆఫీసుకి టయిమయ్యింది' అన్నాడు.

'అయితే అయ్యిందిలే, జాగ్రత్తగావెళ్లిరా. అసలే రోజులు బాగాలేవు' అన్నాడు చంద్రరావు మందలింపు ధోరణిలో.

అలాగేనన్నట్లు నవ్వి తలూపి సైకిలు ఎక్కాడు సుబ్బారావు.

శివాజీ సెంటర్లో మలుపు తిరుగుతూ వుండగా, ఫాన్సీషాపు లోంచి పున్నారావు పలకరించాడు సుబ్బారావుని.

'ఏంటి పంతులుగారూ! అంత స్పీడుగా పోతున్నారూ? ఏంటీ కథా?'—

'ఆఫీసుకి టయిమయిందయ్యా' అని నవ్వాడు సుబ్బారావు.

'ఆగండాగండి' అని బలవంతాన ఆపాడు పున్నారావు. కుర్రాడ్ని అర్జంటుగా పంపి కూల్డ్రింకు తెప్పించాడు. క్లుప్తంగా మంచీ చెడూ మాట్లాడి, 'నా కాగితాలు ఏం జేశారు?' అని అడిగాడు; కూల్డ్రింకులు తాగటం అయ్యాక.

'పుటప్ చేస్తానయ్యా రేపటికి సంతకాలు అవుతాయి' అన్నాడు సుబ్బారావు 'అలా చేయండి. నా నెత్తిన పాలు పోసినట్లే



పంతులుగారూ. మీమేలు మరువను' అని ఎన్ని రకాలుగానో తన కృతజ్ఞతలు తెలుపు కున్నాడు పున్నారావు, సుబ్బారావుకి.

'ఆఫీసుకి టయమయ్యింది. మరి నేను వెళ్లి వస్తాను.'

'అలాగేనండి. జాగర్తగా వెళ్లిరండి బాబూ?' అని హెచ్చరించాడు పున్నారావు.

ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు ఏమిటీ జాగ్రత్తలు? ప్రతివాళ్లూ జాగర్త జాగర్త అని హెచ్చరిస్తారేమిటి?

ఆఫీసు దగ్గర సైకిలు దిగాడు సుబ్బారావు అతని సైకుల్ని అందుకుని స్టాండు వేస్తూ, 'మీకు జాగర్త లేదండీ, గుమాస్తాగారూ.' అన్నాడు అటెండరు ఆనందయ్య నిష్ఠూరంగా.

అవసరం అని వచ్చి, మీద పడితే అతనికి పదీ పరకా అప్పు ఇచ్చి ఆదుకుంటాడు సుబ్బారావు. ఆ కృతజ్ఞత వలన ఆనందయ్య సుబ్బారావుని కంటికి రెప్పలాగ చూసు కుంటాడు. మాటల్లో చేతలలో ఆత్మీయతని వెలిబుచ్చుతూంటాడు.

'ఒక అర్ధ రూపాయ ఇట్లా ఇవ్వండి. ఫ్రంట్ టయర్‌కు పంచరు వేయించుకు వస్తాను. గాలిబోయిన ఈ సైకిల్ని ఎట్లా తొక్కుకు వచ్చారండీ మీరూ?!'

తెల్లబోయి చూసాడు సుబ్బారావు. ఫ్రంటు టయిరు గాలి పూర్తిగా పోయివుంది. ఆనందయ్యకి అర్ధరూపాయి ఇచ్చి పంపి ఆఫీసులోకి చొరబడ్డాడు సుబ్బారావు.

'రండి. రండి. అన్నగారూ ! మీ కోసమే చూస్తున్నాను' అంది అనుపమ ఆ అమ్మాయి కొత్తగా పనిలో చేరింది. తెలీని విషయాలు

జాగ్రత్త

చెప్తూ ఆఫీసు పనిలో ఆమెకి సహాయం చేస్తుంటాడు సుబ్బారావు.

'ఏమిటమ్మా ! ఏమిటీ సంగతీ!' అన్నాడు సుబ్బారావు ఆప్యాయంగా.

'అబ్బ! మీరు ఇంత జాగర్తలేని మనుషు లేమిటండీ బాబూ! ఇవాళ మేనేజింగ్ డయిరక్టరు వస్తున్నారని జ్ఞాపకం పెట్టుకో లేదూ, మీరూ!? ఇప్పటిదాకా చిందులు త్రొక్కి, ఆఫీసరుగారు, ఈ స్టేట్‌మెంట్‌ని నా మొహానకొట్టి, ఎం డీని రిసీవు చేసుకోవ టానిక్కిరైలుస్టేషనుకివెళ్లారు. గంటలోవస్తా రట. అప్పటికి ఈ స్టేట్ మెంట్ పూర్తిచేసి, ఫెయిర్ కాపీ టైపు కొట్టించి ఇస్తే తను సంతకం పెట్టి ఎం, డి. కి ఇస్తారట.' అంది అనుపమ కంగారుగా.

'అలాగే, చేద్దాంలే' అన్నాడు సుబ్బారావు. అలాగే, ఆ స్టేట్‌మెంటూ, దానితోపాటు ఎం. డి. కి చూపించవలసిన ఇతర కాగితాలూ తయారుచేసాడు. ఆఫీసులో సుబ్బారావుకి మంచి పేరు వుంది. బుల్‌వర్కు చేస్తాడని అందరూ అభిమానిస్తారు. ఆఫీసరుకు కుడి భుజం లాంటి వాడని అంటారు. అందువలన అతనంటే అందరికీ అభిమానం.

అంతలో ఎం. డి. ని తీసుకుని అడావుడిగా ఆఫీసరు వచ్చాడు. ఆయనసలే కంగారు మనిషి. రాంగానే ఎం.డీ. ని ఏ. సి. రూంలో పెట్టి, ఇవతలకి వచ్చి, చిందులు వేసాడు ఆఫీసర్.

'ఏమయ్యా! సుబ్బారావ్! మీరంతా ఇంత జాగర్తలేని మనుషులేమయ్యా!? ఏమయి నయ్యా ఆ స్టేట్మెంట్సూ?'— అంటూ నెత్తినెక్కి చిందులు తొక్కాడు.

'రడీ, సార్' అన్నాడు సుబ్బారావు నవ్వి.

'మరి— నాలుగు బండ రిఫరెన్సులూ ఏం చేసావ్? నా ప్రాణం తోడ్తాడే ఎం డీ.'

'అవీ పుటప్ చేసానండీ'

'ఫెయిర్ కాపీలు! అవి కొట్టించావా లేదా ?'

'రడీ సార్. ఏం కంగారు లేదు.'

'అలా అని ముందే చెప్పి వుండకూడదా? మంచి పనివాడివేగానీ— నీకు జాగర్తలేదయ్యా సుబ్బారావూ! పైకి రావలసినవాడివి గదా. అలా వుంటే ఎలా చెప్పు' అంటూ గబగబా ఫైల్సుమీద సంతకాలు పెట్టి, వాట్ని చంకలో పెట్టుకుని, సంతృప్తిగా సకిలిస్తూ ఇకిలింపు మొహం పెట్టుకుని, ధైర్యంగా ఎం. డీ దగ్గరికి నడిచాడు ఆఫీసరు.

పుస్సురని నిట్టూర్చి కుర్చీలో వాలి పోయాడు సుబ్బారావు.

అనుపమ నవ్వింది.

'ఏంటిసార్ ! అలా అయిపోయారు?' అంది.

'జాగ్రత్త.'

"అదేంటి అన్నగారూ ?!' అంది ఆశ్చర్యంగా అనుపమ.

'జాగర్త, జాగ్రత్త అని ఇప్పటికి అర డజనుమందయినా ఈ రోజున నన్ను హెచ్చ రించడం జరిగింది. ఏమిటా జాగ్రత్తా?! ఎనీ థింగ్ డేంజరస్?!— అని నా మనసు పీకుతూ వుంది మేడమ్' అన్నాడు సుబ్బారావు నీరసంగా.

'ఏంలేదు. టయిరయిపోయారు గదా. ఒక

ఇది మీకు చాలా ఉపయోగం

మీ నిత్య వ్యవహారాలకు "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం. అందులో ఏదైనా ఆస్తి కొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికెవరి వద్ద ఎలా లైసెన్సు తీసుకోవాలి, వివిధ జాతుల వివాహ, విడాకుల నిబంధనలు, స్త్రీపురుషుల ఆస్తి హక్కులు, ఎవరితోనైనా ప్రమాదం రాబోతే పోలీసు రక్షణకు ఎవరికెలా వ్రాయాలి. ప్రభుత్వ ఉచిత ఇండ్లస్థలాలు పొందటానికి ఎవరికెలా ధరఖాస్తు వ్రాసిపంపుకోవాలి, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి వాటి వివిధ నమూనాలు, అనేక చట్టాల వివరాలు ఇలాంటివెన్నో మీకు ఉపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీల పుస్తకం. ధర రూ. 12. పోష్టుఖర్చులదనం. దేశసేవ ప్రచురణలు, 2. ఇందిరానగరు, వెంగలరావు నగరు వద్ద, హైదరాబాదు-500890 కు ఉత్తరం వ్రాసి మీ ఉపయోగానికో పుస్తకం వి.పి. పోష్టుద్వారా పొందండి.

కప్పు కాఫీ త్రాగండి. ఆనందయ్యని కాంటీనుకి పంపించాను.'

'అది సరే. ఏమిటీ ఈ జాగ్రత్తలని నా ప్రశ్న గదా !

'ప్రశ్నాలేదు. ఏంలేదు. మనసు సంశయాస్పదమూ, ఆందోళనాయుతమూ అయిన క్షణాలలో ప్రతి మనిషీ అనాలోచితంగా వాడే మాటే జాగ్రత్త. పట్టించుకోనక్కరలేదు.'

'అంతే నంటావా మేడమ్?'

'ఎస్ సర్— లీవ్ ది టాపిక్. కాఫీ వచ్చింది.' అంది అనుపమ. ఆనందయ్య అందించిన కాఫీ కప్పు అందుకుంటూవుండగా వొలికి చొక్కామీద పడింది.

'మీదంతా తొందర సార్ జాగర్త లేదు. నేనిస్తున్నానుగా. చూడండి. మీ చొక్కా పాడయింది' అంటూ విసుగుదలలో ఆప్యాయతని రంగరించి అన్నాడు— ఆనందయ్య.

'ఫర్వాలేదు లేవోయ్. ఇట్సాల్ రయిట్' అని సుబ్బారావు అన్నా, ఆ రోజంతా గొణుగుతూనే వున్నాడు ఆనందయ్య. అతని తీరు అతన్ది.

గంట అయింది.

ఆరు దాటి ఏడూ అయింది.

ఎనిమిదింటికిగాని ఎం, డీ లేచి ఐ. బీ కి వెళ్ళాలేదు. నైట్ హాల్ట్. 'సుబ్బారావ్. మీరంతా ఇక వెళ్ళిరండి. రేపు ఏడింటి కల్లా ఆఫీసులో వుండండి అందరూ, జాగ్రత్త' అంటూ గుసగుసగా సూచనలు ఇచ్చి ఎం. డి. తో పాటు కారెక్కాడు— ఆఫీసరు.

జాగ్రత్త !

జాగర్త ! జాగర్త !!

సైకిలు ఎక్కి ఇంటివయిపుకి సాగిపోతూ వున్న సుబ్బారావు చెవుల్లో ఆ మాటలే మాటి మాటికీ ప్రతిధ్వనిస్తూ వున్నాయి.

బజారు,జనంతో నిండి నేల ఈనినట్లుగా వుంది. సోడియం వేపర్ లాంపులు వెల్తురు ముద్దల్ని గుమ్మరిస్తూ వున్నాయి. హారన్ను మోగిస్తూ జనం మధ్యనుంచి దూసుకుపోతున్నాయి రకరకాల మోటారు శకటాలు. గణ గణ మంటూ గంటలు మోగిస్తూ దూసుకువచ్చి మీద పడినంత పని చేసి తప్పుకుపోతున్నాయి,రిక్షాలూ, బైసైకిళ్ళూ.

అభిమన్యుడిలాగ సైకిలు మీద దూసుకుపోతున్న సుబ్బారావుకి టక్కున ఒక ఆలోచన వచ్చింది ప్రేమతో, అభిమానంతో, ఆదరంతో అతని గుండెలు నిండాయి.

సుజాతకి మల్లెపూలు కొనాలి. బాబుకి చాక్లెట్లు తీసుకొనాలి, ముసలాయనకి పొడుం పుచ్చుకొనాలి. మునిరత్నానికి అరటి పండ్లు తీసుకొనాలి.

తటాలున సైకిలు త్రిప్పకొని రోడ్డు అవతలి వైపుకి పోబోయాడు సుబ్బారావు.

జాగర్త ! జాగర్త ! అని చెవుల్లో ప్రతిధ్వనులు ఇంకా విన్పిస్తూనే వున్నాయి.

సర్రున ఎదుటి నుంచి దూసుకుని వచ్చిన ఎంబాసిడరు కారు కీచుమంటూ బ్రేకులు వేసి ఆగింది కుదుపుతో. కంగారుగా దాన్ని తప్పుకుని ఎడంవయిపుకి బాణంలాగా సైకిల్ని పరుగెత్తించాడు సుబ్బారావు.

వెనుక వయిపు నుంచి, మదించిన ఏనుగులాగా, కట్టుతప్పిన స్పెయిన్ బుల్ లాగా, పిచ్చిపట్టిన కుక్కలాగా, అరుస్తూ — ఓవర్ స్పీడుతో వచ్చి పడింది సిటీబస్సు, తప్పకోవటం శక్యం కాకపోయింది. అయిపోయింది!

అయ్యో! అయ్యో!!

పాపం! ఎంతఘోరం జరిగిపోయింది!!

అన్యాయమండీ బాబూ.

జాగర్త, నాయన్లారా! ఎవరి జాగర్తలు వాళ్ళు పడక పోయిన్నాడు మనయొక్క రోడ్ల మీద. మనుషుల ప్రాణాలకి సెక్యూరిటీలేదు. కనుక జాగ్రత్త అవసరం.

> **గాలీ, నీరూ**
>
> ఒకప్పుడు అనుకున్నా
> ఈ దేశంలో
> గాలీ నీరూ
> ఉచితం అని.
> పాలల్లో నీళ్ళూ
> టూత్‌పేస్టు ట్యూబుల్లో గాలీ
> చూసిన తర్వాత
> ఇప్పుడనుకుంటున్నా
> ధరల పట్టికలో అగ్రస్థానం
> వాటికి ఇవ్వడం
> ఉచితం అని !
>
> — కాశీనాథ & కాశీనాథ

సుబ్బారావింట్లో చీకటి గడ్డకట్టివుంది ఒక గంట తరువాత.

గచ్చు నేలమీద ఆరడుగుల పొడవున తెల్లగా గుడ్డ ఆ బట్టకి ఒక వయిపున గుడ్డిగా వెల్గుతూ వుంది ఆముదపు దీపం. ఆ బట్టక్రింద-పక్షి ఎగిరిపోయిన సుబ్బారావు నిర్జీవ దేహం. ప్రక్కనే మొదలు నరికిన చెట్టులా పడివుంది సుజాత. ఆమెకి కుడి వయిపున దుఃఖసాగరంలో కూలబడి వున్నాడు ముసలాయన.

మునిరత్నం, చంద్రరావు, పున్నారావు, అనుపమ, ఆనందయ్య, ఆఫీసరు, ఆఫీసు స్టాఫూ తలలు వాల్చుకుని నిలబడి వున్నారు. ఎవరి మొహంలోనూ కళలేదు. అందరి చూపులలోనూ భయం, వేదనా, దుఃఖం! ఏదో పోగొట్టుకున్నతనం. వెలితి.

వున్నట్టుండి, ఆర్తనాదంతో ఎలుగెత్తి శోకించింది సుజాత. బావురుమన్నాడు ముసలాయన. గొల్లుమన్నారు మునిరత్నం, ఆనందయ్య. కళ్లు వత్తుకుంది అనుపమ. పున్నారావు, చంద్రరావూ బిక్కమొహాలు పెట్టారు. ఆఫీసరు కర్చీఫులోకి ముక్కు చీదుకున్నాడు!

నలుగురికీ కావలసిన మనిషి సుబ్బారావు. సహృదయుడు. ప్రేమాస్పదుడు. మంచివాడు, సుబ్బారావు. ఏ ఒక్కరికీ దక్కకుండా పోయాడు. అందుకే శల్య సదృశమయిన బాధ.

అప్పుడు అక్కడికి తప్పటడుగులు వేస్తూ వచ్చాడు బాబు. సుజాత దగ్గరకి వెళ్లి ఆమె మెడని కావిలించుకుని తన వయిపుకి తిప్పకున్నాడు. లేత గొంతుకతో, కాతర స్వరంలో 'అమ్మా' అని పిలిచాడు. 'అమ్మా. అమ్మా' అని పిలిచాడు ముద్దు ముద్దుగా, అమ్మని.

'నా సంగతి ఏమిటే అమ్మా? నా గురించిన జాగ్రత్తలు ఎవరు పడతారు మరీ?' అన్న ప్రశ్న ఆ పిలుపులో వున్నట్లనిపించింది, విన్న నలుగురికీ.

కారు చీకటిలో కాంతిరేఖ తొంగి చూసింది. శిథిలాల నుంచి చిరుమొక్క చిగుళ్లు బయట పడ్డాయి. స్తంభించిన వాతావరణంలోకి సన్నటి గాలి రివటు వీచింది.